మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



# 29 నుంచి సిటీ పోలీసు యాక్ట్ అమలు

**సిపి డా॥ అనురాధ**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 29వ తేదీ నుంచి డిసెంబర్ 14వ తేదీ వరకు సిటీ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ డాక్టర్ అనురాధ బుధవారం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. పై కార్యక్రమాలు నిర్వహణకు ముందుగా పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. బంద్ల పేరిట వివిధ కారణాలను చూపుతూ వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసివేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు ఉన్నాయని అనుమతి లేకుండా ఎవరైనా డిజె వినియోగిస్తే చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు.

'వార్త'కు స్పందన

# సమస్యలు పరిష్కరిస్తా : జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నీలిమ

**చిన్నశంకరంపేట, నవంబరు 27, ప్రభాతవార్త:** వసతి గృహంలోని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నీలిమ అన్నారు. వసతి గృహంలో విద్యార్థులు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని 'వార్త'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. వణుకుతున్న వసతి గృహం విద్యార్థులు అనే శిర్షికన ఈ నెల 23న 'వార్త'లో ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నిలిమ మంగళవారం రాత్రి గిరిజన అభివృద్ధి, బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో ఉన్న కూరగాయలు, సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన బోజనం అందించాలని సూచించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వసతి గృహం వార్డెన్ దర్శన్‌కు పలు సూచనలు చేశారు.



డిజైన్లను పరిశీలిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

# పర్యాటక అభివృద్ధిపై మంత్రి సమీక్ష

**పుల్‌కల్, నవంబరు 27, ప్రభాతవార్త:** అందోల్ నియోజకవర్గంలో చేపట్టనున్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సింగూరు డ్యామ్ బ్యూటిఫికేషన్, ఐలాండ్ డెవలప్‌మెంట్ స్ల్కప్చర్ గార్డెన్‌ల అభివృద్ధికి సంబంధించిన డిజైన్‌లను మంత్రి పరిశీలించారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విధంగా పర్యాటక ప్రాంతాలు ఉండాలన్నారు. అందోల్ చెరువు బ్యూటిఫికేషన్ డిజైన్‌లను రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన సమావేశంలో పర్యాటకశాఖ డిప్యూటీ ఈఈ నటరాజ్, ఆర్కిటెక్ట్ విజయ్ కుమార్, సివిల్ ఇంజనీర్ వినీత్ తదితరులు ఉన్నారు.

# మండల ప్రజాపరిషత్‌గా చౌటకూరు

**-ఉత్వర్వులు జారీ చేసిన ప్రభుత్వం**



చౌటకూరులో రెవెన్యూ కార్యాలయం

**చౌటకూరు, నవంబరు 27, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లాలోని చౌటకూరు, నిజాంపేట్ రెవెన్యూ మండలాలను మండల ప్రజాపరిషత్‌లుగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ ఈ నెల 21న జీఓ ఎంఎస్ నంబర్ 67 ద్వారా ఉత్వరులు జారీ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అందోలు అసెంబ్లి నియోజకవర్గంలోని చౌటకూరు, నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట్‌లను 2020లో కొత్త రెవెన్యూ మండలాలుగా ఆవిర్భవించాయి. 15 గ్రామ పంచాయతీలతో చౌటకూరు మండలాన్ని, 18 గ్రామ పంచాయతీలతో నిజాంపేట్ మండలాన్ని ఏర్పాటు చేశారు. గడిచిన 5 ఏళ్లుగా ఆయా మండలాల్లో కేవలం రెవెన్యూ కార్యకలాపాలు మాత్రమే కొనసాగుతున్నాయి. చౌటకూరు మండల ప్రజా పరిషత్ ఏర్పాటు కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

**-ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రియాంక**



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రియాంక

**గజ్వేల్ టౌన్, నవంబరు 27 (ప్రభాతవార్త):** బాల్య వివాహాలను నిర్మూలించి బాలల బంగారు భవిష్యత్తును కాపాడదామని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ బి. ప్రియాంక పిలుపునిచ్చారు. మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ బాల్యవివాహాలను ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను అందరికీ అవగాహన కలినపంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నెం. 1098కు ఫోన్ చేసి బాల్య వివాహాలు నిర్మూలించాలని మన దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయినప్పటికీ ఇంకా బాల్య వివాహాలు జరగడం బాధాకరమన్నారు. బాల్యవివాహాల వల్ల అమ్మాయి, అబ్బాయి జీవితాలు నాశనం అవుతాయని, సంబంధిత అధికారులు తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. 18 సంవత్సరాలలోపు బాలికలకు, 21 సంవత్సరాలలోపు అబ్బాయిలకు వివాహం చేస్తే పెళ్ళి కుమారునికి, తల్లిదండ్రులకు, పెళ్ళిలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహాలను అరికట్టడానికి అనేక కార్యక్రమాలను చేపడుతుందని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, గజ్వేల్ సిఐ సైదా, న్యాయవాదులు ఎల్లం, గఫర్, లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెరువులను కాపాడుకునేందుకే హైడ్రా

**-హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**రామచంద్రాపురం, నవంబరు 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తెల్లాపూర్ మున్సిపాలిటి పరిధిలోని మేళ్ల చెరువు, ఉస్మాన్ నగర్‌లోని చెలికుంట చెరువులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం సాయంత్రం సందర్శించారు. మేళ్ల చెరువు కబ్జాకు గురుతోందని కొందరు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు రంగనాథ్ మేళ్ల చెరువును సందర్శించారు. కబ్జాకు గురైన చెరువును కాపాడుతామని రంగనాథ్ ప్రజలకు భరోసా కల్పించారు. చెరువు పరిధిని పూర్తి సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందచేసి చర్యలు తీసుకుంటామన్నారు. చెరువులు, కుంటలను కాపాడటమే హైడ్రా పని అని గుర్తు చేశారు.



అధికారులకు సూచనలు చేస్తున్న హైడ్రా కమిషన్ రంగనాథ్

## రోడ్ల విస్తరణ..జాతీయ రహదారులు..

# హైలెవల్ బ్రిడ్జిలకు నిధులు విడుదల చేయండి

**కేంద్ర రహదారుల శాఖ మంత్రికి విన్నవించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్‌రూరల్, నవంబరు 27, ప్రభాతవార్త** హుస్నాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న జాతీయ రహదారితో పాటు డబుల్‌రోడ్లు, విస్తరణ, హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గట్కారీకి బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం నుండి దేవక్కపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులు, పిడబ్ల్యూడి నుండి నాగసముద్రాల రోడ్డు విస్తరణ, అంతకపేట నుండి, రామవరం, జనగామ, గుగ్గిళ్ల నుండి తంగళ్లపల్లి, తంగళ్ళపల్లి నుండి వయా గుండారెడ్డిపల్లి నుండి బద్దిపడగ వరకు, గుంటూరుపల్లి నుండి కేశవాపురం, కోతులనడుమ, ముల్కనూర్ వయా గోపాల్‌పూర్, కోతులనడుమ నుండి జగన్నాధపురం వయా జిలుగుల పెంచుకర్ల, వంగర హుజురాబాద్ నుండి కన్నారం, హుజురాబాద్ నుండి సుందరగిరి రోడ్ల విస్తరణతో పాటు హుజురాబాద్ నుండి సుందరగిరి మధ్య హైలెవల్ బ్రిడ్జి, మూలంగూర్ సైదాపూర్ మధ్యలో హైలెవల్ బ్రిడ్జి, కొత్తగట్టు దుద్దెనపల్లి మధ్యలో, మానకొండూర్ నుండి హుస్నాబాద్ మధ్యలో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం కోసం నిధులు విడుదల చేయాలని కేంద్రమంత్రిని కోరినట్లు తెలిపారు.



కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**



విద్యార్థులను భోజనం గురించి అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 27, ప్రభాతవార్త :** ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులకు అందించే మెనూలో క్వాలిటీతో పాటు క్వాంటిటీని పాటించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం రామాయంపేట మున్సిపాలిటీలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ బాలికల కళాశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండేలా చూడాలని, బియ్యం, సరుకులు నాణ్యత లేకుంటే తక్షణమే మార్చాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. మెనూ పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలమేరకు అన్ని సంక్షేమ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో సౌకర్యాలతోపాటు విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలని సమావేశాల ద్వారా ఆదేశించిన మేరకు సరికొత్త మెనూ కూడా వారం రోజుల్లో అందుబాటులో ఉంటుందని, ఈ మెనూ పగడ్బందీగా అమలు చేస్తామన్నారు. జిల్లాలో 105 రెసిడెన్సియల్ స్కూల్స్, కళాశాలలు, వసతి గృహాల్లో, 897 ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకు జిల్లా, మండల, డివిజన్ స్థాయిలో ప్రత్యేక అధికారులద్వారా పటిష్ట పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రొఫార్మాని ప్రత్యేక అధికారులకు ఇవ్వడం జరిగిందని, ఆ ప్రొఫార్మా ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో, స్టోర్ రూమ్, కూరగాయల నాణ్యత, కోడిగుడ్ల సరఫరా, వంట పాత్రలు పరిశుభ్రత లాంటిపై పటిష్ట పర్యవేక్షణ, అలసత్వంపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల స్థాయిలో గెజిటర్ ర్యాంకు ఉన్న జిపి ప్రత్యేక అధికారుల ద్వారా కూడా మూడు రోజుల్లో వారి పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని రోగులకు భోజనం అందించే నర్సాపూర్, తూప్రాన్, మెదక్ ఆస్పత్రులను సంబంధిత ఆర్డివో ద్వారా పరిశీలనకు ఆదేశించడం జరిగిందన్నారు. మెనూలో క్వాలిటీ, క్వాంటిటీ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చి ఈ శనివారం అన్ని సంక్షేమ, రెసిడెన్సియల్, హాస్టల్స్, వంట తయారు చేసే సిబ్బందికి, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు వంట ఉండే విధానం, వడ్డించే విధానం, కూరగాయల నాణ్యత, స్టోర్‌రూమ్ పరిశుభ్రత ఈ అంశాలపై వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా తగు ఆదేశాలు జారీచేయడం జరుగుతుందని చెప్పారు. పోషకాహారం సరిపడా అందించేలా చూడాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో 15 శాఖా గ్రంథాలయాలు, ఒక జిల్లా గ్రంథాలయం

**-జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి**

**వెల్దుర్తి, నవంబర్ 27 ప్రభాతవార్త:** మెదక్ జిల్లాలో 15 శాఖ గ్రంథాలయాలు, ఒక జిల్లా గ్రంథాలయం, మొత్తం 16 గ్రంథాలయాలు ఉన్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి తెలిపారు. బుధవారం వెల్దుర్తిలో రూ.25లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 రోజుల్లో గ్రంథాలయ శాఖకు భవనాన్ని అప్పగించే విధంగా వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. ఫర్నీచర్‌తోపాటు పుస్తకాలు, ఇతర సౌకర్యాలు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు పోటీ పరీక్షలు దగ్గర పడుతున్నాయని, గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో 14 గ్రంథాలయాలకు శాశ్వత భవనాలు ఉన్నాయని, జిల్లాలో రేగోడ్ గ్రంథాలయ భవన నిర్మాణానికి 50లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. నూతన మండలాలైన నిజాంపేట, మనోహరాబాద్, హవేలి ఘనపూర్, చిలిపిచెడ్ మండలాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పపండం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ కార్యదర్శి వంశీ కృష్ణ, లైబ్రేరియన్ యాదగిరి, అర్చన, స్వామి, నాయకులు నరేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కిష్టాగౌడ్, నాయకులఉ శంకరయ్య, శేఖాగౌడ్, కృష్ణ, కిష్టయ్య, యాదగిరి, మైసయ్య పాల్గొన్నారు.



వెల్దుర్తిలో గ్రంథాలయ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సుహాసినిరెడ్డి

# రోడ్డు పక్కనే మద్యం దుకాణం

**ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు..రాత్రి పదైనా కొనసాగిస్తున్న దుకాణం..ఇతర ప్రాంతాలకు మార్చాలని కోరుతున్న స్థానికులు**

**చిన్నశంకరంపేట, నవంబరు 26, ప్రభాతవార్త:** ప్రధాన రహదారుల వద్ద మద్యం దుకాణం ఉండటంతో ఇటు స్థానికులు, అటు కళాశాల విద్యార్థులు, బాటసారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నశంకరంపేట పట్టణంలో మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై ఓ మద్యం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. మద్యం దుకాణం ముందు నుంచే ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల విద్యార్థులు వస్తూపోతూ ఉంటారు. ఉదయం విద్యార్థులు సాఫీగానే వెళ్తున్నారు. ఎందుకంటే ఆ సమయంలో మద్యం దుకాణం తెరచి ఉండదు. సాయంత్రం కళాశాల, పాఠశాలలు పూర్తయిన తరువాత మద్యం దుకాణం తెరచి ఉండటంతో మందుబాబుల ముందు నుంచే విద్యార్థినిలు ఇబ్బంది పడుతూ వెళ్తున్నారు. వాహనాలు సైతం ప్రధాన రహదారి వెంట నిలిపి ఉండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సి వస్తోంది. ఒకానొక సమయంలో నిలిపి ఉన్న వాహనాన్ని ఢీకొని కిందపడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. రోడ్డుపై వాహనాలు నిలపడంతో ఇరుకు రోడ్డులో ఇబ్బంది పడుతూ వెళ్లాల్సి వస్తుందని, ప్రయాణికులు తెలిపారు. టెండర్ల ద్వారా మద్యం దుకాణాలు దక్కించుకుంటున్నారు. అయితే సరిగ్గా నిర్వహణ లేకపోవడంతో స్థానికులు, రోడ్డుపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 4 గంటలనుండి రాత్రి 10 గంటల తరువాత కూడా మందుబాబులు నానా హంగామ సృష్టిస్తారు. అలాగే పట్టణ పరిధిలో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో బెల్ట్‌షాప్‌లకు కూడా ఇష్టారీతిన మద్యాన్ని అమ్ముతున్నారు. ఆబ్కారి అధికారులు పార్కింగ్ సౌకర్యం లేకున్నా మద్యం దుకాణాలకు అనుమతులివ్వడం శోచనియం.




మద్యం దుకాణం ముందు నుంచి ఇబ్బంది పడుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

**రోడ్డుపై పారుతున్న మురికి నీరు...**

మద్యం దుకాణం ముందు నుంచి మురికి నీరు పారడంతో లారీలు, బస్సులు వెళ్తున్నప్పుడు ఆ నీరు తమపై పడుతున్నాయని విద్యార్థులు తెలిపారు. చేగుంట నుండి మెదక్‌కు వెళ్లే దారిలో మద్యం దుకాణం డౌన్‌లో ఉండటంతో వాహనాలు సైతం అధిక వేగంతో వస్తున్నాయని మద్యం దుకాణం ముందు రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉండటంతో ఎక్కడికక్కడ వాహనాలు ఆగిపోతున్నాయి. ప్రధాన రహదారి కావడంతో నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ప్రధాన రహదారి నుండి మద్యం దుకాణాన్ని తరలించాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు. మద్యందుకాణానికి రావడానికి చిన్న శంకరంపేట వైపు నుండి రాంగ్ రూట్‌లో మద్యం దుకాణం కొంత దూరంలో యూ టర్న్ ఉన్నప్పటికి మందుబాబులు మాత్రం రాంగ్ రూట్‌లో వస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. రాత్రి పదిదాటినా మద్యం దుకాణాన్ని నిర్వాహకులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మద్యం దుకాణాన్ని ఇతర ప్రాంతాలకు తరలించాలని, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

## ఈవిఎంలపై ప్రజాహిత వ్యాజ్యాన్ని కొట్టేసిన సుప్రీంకోర్టు

**-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్**

**సంగారెడ్డి బ్యూరో, నవంబరు 27 ప్రభాతవార్త:** ఈవీఎంలపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఏ.పాల్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు ధర్మాసనం కొట్టివేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీ.బీ. వరాల్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌ను పరిశీలించి ఈవీఎంల ట్యాంపరింగ్‌కు సంబంధించిన వాదనలను తిరస్కరించింది. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించడం తగదని స్పష్టం చేసింది. "ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంల ట్యాంపరింగ్ గురించి ఎవరూ అనుమానం వ్యక్తం చేయరు. కానీ ఓటమి జరిగినప్పుడు మాత్రమే ట్యాంపరింగ్ జరిగిందని అనడం సరైన దృష్టికోణం కాదు." అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ తీర్పు ఈవీఎంల విశ్వసనీయతకు మద్దతుగా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరగుతుందనడానికి రుజువుగా నిలుస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారి వివిధ ప్రచార మాధ్యామాలు, మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసి ఈవీఎంలపై అవగాహన కల్పించాలని సూచించినట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్లు అందరూ ఎన్నికల ప్రక్రియ, భారత ఎన్నికల సంఘంపై నమ్మకం కలిగిఉండి ప్రజాస్వామ్య ప్రాతిపదికగా నిర్వహించే ఎన్నికల్లో చురుకుగా పాల్గొనాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ కోరారు.

# నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

**-మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి**



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

**పెద్దశంకరంపేట, నవంబర్ 27 ప్రభాతవార్త:** జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం పెద్దశంకరంపేటలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. నేరాలకు సంబంధించిన కేసులను సత్వరమే పరిష్కరించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. వచ్చే నెల 9వ తేదీన లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎస్‌ఐ శంకర్, ఏఎస్‌ఐ విఠల్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

**దుబ్బాక, నవంబరు 27, ప్రభాతవార్త :** గత నెల సంగారెడ్డిలో జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో మండల పరిధిలోని హబ్సీపూర్ గురకుల పాఠశాల నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మితిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హాకీ అండర్-14 విభాగంలో ఈనెల 28, 30 తేదీలలో కరీంనగర్‌జిల్లా హుజురాబాద్‌లో జరిగే 68వ రాష్ట్రస్థాయి పోటీలలో మితిల్ పాల్గొంటారని ప్రిన్సిపల్ గోపాల్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన మితిల్‌ను ఉపాధ్యాయుల బృందం, పీఈటీ తరుణ్‌రాజ్ అభినందించారు.

## పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించాలి : ఎంపిడివో



అంగన్‌వాడీ కేంద్రంలో బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో దామోదర్

**చిన్నశంకరంపేట, నవంబరు 27, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల మానసీక, శారీరక ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో దామోదర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. చిన్నారులకు, గర్భిణీలకు పౌష్టికాహారం ఇవ్వాలని తెలిపారు. అంగన్‌వాడీ టిచర్ నాగరాణీకి పలు సూచనలు చేశారు.

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

**చిన్నశంకరంపేట, నవంబరు 27, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రల్లో పిల్లలకు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని మండల తహసీల్దార్ మన్నన్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని మిర్జాపల్లి తండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తిసుకోవాలని ఆయన సూచించారు.



అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలతో మాట్లాడుతున్న తహసీల్దార్ మన్నన్

## ఉరేసుకున్న యువకుడిని కాపాడిన కానిస్టేబుల్

**జగదేవ్‌పూర్, నవంబరు 27 (ప్రభాతవార్త):** ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన యువకుడిని కానిస్టేబుల్ సిపిఆర్ చేసి కాపాడిన సంఘటన జగదేవ్‌పూర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... జగదేవ్‌పూర్‌కు చెందిన వంటేరు సందీప్‌రెడ్డి(32) రెస్టారెంట్‌ను నడుపుతూ జీవనం సాగిస్తుండగా కొన్ని నెలల నుండి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ మంగళవారం ఉదయం 11 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా నమ్మదగిన సమాచారంతో జగదేవ్‌పూర్ బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ లింగం లొకేషన్ ద్వారా అతని ఇంటికి వెళ్లగా తలుపులు మూసి ఉండడంతో పగులగొట్టి ఉరేసుకున్న సందీప్‌రెడ్డిని కిందకు దించాడు. అపస్మారక స్థితిలో ఉన్న సందీప్‌రెడ్డికి వెంటనే కానిస్టేబుల్ లింగం సిపిఆర్ చేసి స్పృహలోకి రాగానే వెంటనే గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి అతని బంధువులతో కలిసి పంపించారు. ఆసుపత్రిలో వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సందీప్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ధైర్యంచేసి సిపిఆర్‌చేసి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ లింగంను పోలీస్ కమిషనర్ అనురాధ, గజ్వేల్ ఏసిపి పురుషోత్తంరెడ్డిలు అభినందించి త్వరలో పోలీస్ కమిషనర్ చేతులమీదుగా రివార్డు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సంఘటన తెలుసుకున్న స్థానికులు, సందీప్‌రెడ్డి బంధువులు, కుటుంబసభ్యులు కానిస్టేబుల్ లింగంను అభినందించారు.


నియామకం పత్రాన్ని అందిస్తునంన దృశ్యం

## కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్‌యాదవ్

**చిన్నకోడూరు, నవంబరు 27, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ చిన్నకోడూరు మండల సేవాదళ్ అధ్యక్షుడిగా అరుకలా శ్రీకాంత్ యాదవ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీకాంత్ యాదవ్‌కు నియామకం పత్రాన్ని అందించారు. అనంతరం మండల సేవాదళ్ నూతన అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ మండలంలో పార్టీ పటిష్టత కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించి పదవి రావడానికి సహకరించిన కృష్ణారెడ్డి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ, చిరంజీవి, రాజారామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ నియోజకవర్గ ఇంచార్జి బబ్బులుగౌడ్, బంక చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

**కొమురవెల్లి, నవంబరు 27, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కేజీబీవీ హాస్టల్‌ను ఎస్‌ఎఫ్‌ఐ చేర్యాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సందర్శించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్‌కుమార్ మాట్లాడుతూ కేజీబీవీలో మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, దుప్పట్లు, శ్వెటర్లు, చలి కాలంలో వేడినీరు అందించాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఫుడ్ పాయిజన్ కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జస్వంత్, మౌనిక,హారిక తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి : డిపిఎం


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**నంగునూర్, నవంబరు 27, ప్రభాతవార్త :** కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీపీఎం కర్ణాకర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని అంక్షాపూర్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో కనీస అవసరాలు నీరు, విద్యుత్, నీడలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన 7 కేంద్రాలలో 829 మంది రైతుల నుంచి 31 వేల 1 వంద 13 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకొని మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం మహిపాల్, సీసీలు పంగ లింగం, సాయిలు విఓఎ విజయ్, కమిటి సభ్యులు జ్యోతి,సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్


మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు

**సిద్దిపేట అర్బన్, నవంబరు 27, ప్రభాతవార్త :** జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ఈనెల 28న జిల్లా కేంద్రంలోని నర్సాపూర్ ఎక్స్‌రోడ్డులో గల లయన్స్‌భవన్‌లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు తుమ్మ సత్యం, ప్రధాన కార్యదర్శి కె.కనకరాజులు తెలిపారు.బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 21న మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయికి రావాలన్నారు. ఉదయం 9.30 గంటలకు విద్యార్థులు తమ గైడ్ టీచర్లతో చేరుకోవాలన్నారు. ఉదయం 10 గంటలకు తమ పాఠశాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 10.30కి జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. విజేతలకు మధ్యాహ్నం అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సమయానికి చేరుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మొలుగు బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు సాదత్‌అలీ, రాజమౌళి, పి.బాలకిషన్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు జోజి పాల్గొన్నారు.

## గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కరీమొద్దీన్

**గజ్వేల్, నవంబరు 27 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సిద్దిపేట జిల్లా నూతన కమిటీని బుధవారం సిద్దిపేట పట్టణంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ ఇందిరానగర్ పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా టిఎస్‌జిహెచ్‌ఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.రాజగంగారెడ్డి హాజరై ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీ జిల్లా అధ్యక్షునిగా ఎండి.కరీమొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా కె.రాజిరెడ్డి, కోశాధికారిగా బి.చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వహణలో ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేయడం సరైందికాదని, మధ్యాహ్న భోజన పథకాన్ని సెంట్రలైజ్డ్ కిచెన్‌కు అప్పగించాలన్నారు. అలాగే ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పించడంలో రాష్ట్ర శాఖ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు కరీమొద్దీన్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తామని తెలిపారు.

## లబ్దిదారుడికి సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**సిద్దిపేట అర్బన్, నవంబరు 27, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లికి చెందిన సామాజికవేత్త బాలరాజు కృష్ణమూర్తి బుధవారం గ్రామానికి చెందిన లబ్దిదారుడు రాజిరెడ్డికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. అర్హులైన పేదలకు సిఎంఆర్‌ఎఫ్ అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పోరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకోవడానికి సిఎంఆర్‌ఎఫ్ ఎంతో మేలు చేస్తుందన్నారు. సిఎంఆర్‌ఎఫ్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన మార్కెట్ కమిటీ పాలకవర్గం


బాధ్యతలు స్వీకరించిన నూతన పాలకవర్గం

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 27, ప్రభాతవార్త** హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బంక చందు(ఐలయ్య), ఏఎంసి డైరెక్టర్‌లుగా బొడిగె పర్శరాములు, పత్తిపాక త్రిమూర్తి, ఒరుగంటి భారతిదేవి, పోతుగంటి బాలయ్య, మహ్మద్ కుతుబుద్దిన్, బొంగోని శ్రీనివాస్, లావుడ్య భీక్యానాయక్, మడప యాదవరెడ్డి, కరంటోతు రవినాయక్, బైకంటి శ్రీనివాస్, తేరాల మారుతి, తనుకు ఆంజనేయులులకు మార్కెట్ కమిటీ కార్యాలయ సమావేశ మందిరంలో మార్కెట్ కార్యదర్శి డి.ప్రభాకర్ పదవి బాధ్యతలు అప్పగించి నియామక పత్రాలను అందజేశారు. నూతన చైర్మన్‌గా ఎన్నికైన కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన బంక చందు(ఐలయ్య)లు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని, హుస్నాబాద్ మార్కెట్ కమిటీకి మంచి గుర్తింపు తీసుకొస్తామన్నారు. నియామకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన నూతన పాలకవర్గానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, జిల్లా లైబ్రరీ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులారెడ్డి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకం పత్రం అందుకుంటున్న మంద పాండు

## డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడిగా మంద పాండు

**చిన్నకోడూరు, నవంబరు 27, ప్రభాతవార్త :** కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా చిన్నకోడూరు మండలం గుర్రాలగొంది గ్రామానికి చెందిన మంద పాండును నియమిస్తూ బుధవారం డీసీసీఅధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరవేయడానికి ప్రతి ఒక్కరం సైనికుల్లా పని చేద్దామన్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా నియామకమైన మంద పాండు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత పటిష్టం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన పదవి రావడానికి సహకరించిన జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, డీసీసీ అధ్యక్షులు నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆయిల్‌ఫామ్ పంటను సాగుచేయాలి

### ఉన్యానవన శాఖ అధికారి సువర్ణ


డ్రాగన్ ఫ్రూట్,ఆయిల్ ఫామ్ పంటల పరిశీలిస్తున్న సువర్ణ తదితరులు

**రాయపోల్, నవంబర్ 27 ప్రభాతవార్త :** ఆయిల్ ఫామ్ పంటను సాగు చేసి రైతులు అధిక దిగుబడులు పొందాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారిని సువర్ణ అన్నారు. బుధవారం రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లిలో ఆయిల్ ఫామ్‌ను, వడ్డేపల్లిలో డ్రాగన్ ఫ్రూట్ తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కొత్తగా అయిల్ ఫామ్ చేసే ఎస్సీ,ఎస్టీ రైతులకు 100 శాతం, ఇతరులకు 90 శాతం సబ్సిడిపై డ్రిప్పు,మొక్కలను అందచేయడం జరుగుతుందని తెలిపారు.ఎకరానికి ప్రతి సంవత్సరం 10 టన్నుల పామాయిల్ దిగుబడి వస్తుందని తెలిపారు.2025 జూన్ నాటికి సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలంలోని ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తుందని అన్నారు.ఇప్పటి వరకు సిద్దిపేట జిల్లాలో 11 వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతుందని అన్నారు.ఆయిల్ ఫామ్ తోటలో మూడు సంవత్సరాల వరకు అంతర్ పంటలు మొక్కజొన్న, వేరుశనగ ఇతర పంటలను సాగు చేసి దిగుబడులు పొందవచ్చని అన్నారు. ఆమె వెంట ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ అంజనేయులు, ఉద్యాన అధికారి రమేష్ రైతులు తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### -డిఆర్‌డిఓ పిడి జయదేవ్ ఆర్య

**జగదేవ్‌పూర్, నవంబరు 27 (ప్రభాతవార్త):** పంటను రైతులు దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని సిద్దిపేట జిల్లా డిఆర్‌డిఓ పిడి జయదేవ్ ఆర్య అన్నారు. బుధవారం మునిగడప గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జగదేవ్‌పూర్ ఎంపిడివో బి.యాదగిరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని, పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, సన్న రకాల వడ్లకు ప్రభుత్వం ద్వారా రూ.500 బోనస్ అందిస్తుం దని, దళారులకు అమ్మి నష్టపోవద్దని అన్నారు. ప్రతి రైతు నాణ్యతా ప్రమాణాలు పాటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించాల న్నారు. కార్యక్రమంలో డిపిఎం వాసుదేవ్, జగదేవ్‌పూర్ ఏపిఎం కిరణ్‌కుమార్, ఈసీ సుధాకర్, సిసిలు రవి, స్వామి, పంచాయతీ కార్యదర్శి హరీష్, రజిత, హంస, కవిత తదితరులు పాల్గొన్నారు.


మునిగడపలో ధాన్యం తేమశాతం పరిశీలిస్తున్న డిఆర్‌డిఓ పిడి జయదేవ్‌ఆర్య


సిఐటియు సభ్యత్వాలను స్వీకరిస్తున్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు

## కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

### -సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి

**జగదేవ్‌పూర్, నవంబరు 27 (ప్రభాతవార్త):** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యుడు మరాటి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు.బుధవారం జగదేవ్‌పూర్ మండలకేంద్రంలో ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న వారు సిఐటియు సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ దాదాపు 10 సంవత్సరాలుగా ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లుగా సేవలు అందిస్తున్న వీరికి ప్రస్తుతం గ్రామపంచాయతీల ద్వారా రొటేషన్ పద్దతిలో వేతనాలు అందుతున్నాయని, అట్టి వేతనాలు కూడా రెండుమూడు నెలలకు ఒకసారి అందడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే వీరిని గుర్తించి ట్రెజరీ ద్వారా వేతనాలు అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గజ్వేల్ డివిజన్ నాయకుడు పొట్టోళ్ల దాసు, ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు కృష్ణ, లక్ష్మి, బాలకృష్ణారెడ్డి, నర్సింలు, ఎల్లయ్య, మర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**కొండపాక, నవంబరు 27, ప్రభాతవార్త :** పాథ్ ఫైండర్ జిల్లా స్థాయి పోటీ పరీక్షల కోసం విద్యార్థులకు బుధవారం దుద్దెడ పాఠశాలలో కోణం ఎల్లయ్య 6,7,8 తరగతుల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాథ ఫైండర్ కోఆర్డినేటర్ పంజ రమేష్ పరీక్ష గురించి విద్యార్థులకు వివరించారు. పరీక్ష యొక్క ఉదేశ్యం గణిత శాస్త్రంలో నైపుణం సాధించడం ఎలాగో తెలిపారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో గణిత శాస్త్రం యొక్క ప్రాధన్యంతను వివరించారు. మనిషి పుట్టుక నుండి మరణించే వరకు గణితం జీవితంలో ఒక భాగం అయిందని తెలిపారు.

## సిపిఎం జిల్లా మహా సభలను జయప్రదం చేయాలి


హమాలీ కార్మికులతో సమావేశం నిర్వహించిన సిపిఎం నాయకులు

**కొండపాక, నవంబరు 27, ప్రభాతవార్త :** డిసెంబర్ 1న సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు అమ్ముల బాల్ నర్సయ్య కోరారు. బుధవారం వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద మండల అధ్యక్షుడు రవీంద్రచారితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మర్పడ్గ, సిర్సనగండ్ల, కొండపాక గ్రామాల్లో హమాలీ కార్మికులతో నిర్వహించి వారు మాట్లాడారు. డిసెంబర్ 1,2 తేదిల్లో సిపిఎం సిద్దిపేట జిల్లా మహా సభలు గజ్వేల్ పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 1న భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. మహాసభలో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజవ్యతిరేక విధానాలను ఎండగట్టడానిక తీసుకొవాల్సిన చర్యలను చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు హాజరై ప్రసంగించనున్నట్లు వివరించారు. కార్యక్రమాల్లో కొమురయ్య, గుమ్మడి లింగయ్య, మల్లేశం, ఎల్లయ్య, కనకయ్య, అయిలయ్య, నర్సయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## కార్యాలయాల ఏర్పాటుకు స్థల పరిశీలన

**చౌటకూరు, నవంబరు 27, ప్రభాతవార్త:** మండలానికి సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్థలాలను బుధవారం ఇంచార్జి తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్ స్థానికులతో కలిసి పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న కూరగాయల మార్కెట్ స్థలం రైతు వేదిక, బసన్నవాగు వద్ద ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన ఖాళీ స్థలాల వివరాలను మంత్రి దామోదర్ రాజనర్సింహా దృష్టికి తీసుకుపోతామని మన్నె కిరణ్‌కుమార్ వివరించారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ కిరణ్‌కుమార్

## 29న సిద్దిపేటలో దీక్షా దివస్ : బిఆర్ఎస్ నేతలు


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**చిన్నకోడూరు, నవంబరు 27, ప్రభాతవార్త :** చావు నోట్లో తలపెట్టి కెసిఆర్ రాష్ట్రాన్ని సాధించుకొస్తే ద్రోహుల కబంధ హస్తాలలో తెలంగాణ విలవిలవిలాడుతుందని బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, ఎంపిటిసిల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు ఇట్టబోయిన శ్రీనివాస్, బిఆర్‌ఎస్ నాయకుల జంగిటి శ్రీనివాస్ అన్నారు.చిన్నకోడూరులో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 29న జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్సీలు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రాన్ని సిఎం రేవంత్‌రెడ్డి చిన్నభిన్నం చేస్తున్నారని ఆరోపించారు. దీక్షా దివాస్ కార్యక్రమంతో సిఎం రేవంత్‌రెడ్డి చెంపపెట్టు కావాలన్నారు. సమావేశంలో ములకల కనకరాజు, కీసరి పాపయ్య, ఎంరెడ్డి భూమిరెడ్డి, కాల్వ ఎల్లయ్య, పంపరి కనకయ్య, గుజ్జ రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయానికి ఎమ్మెల్యే హరీష్‌రావు విరాళం

**సిద్దిపేట రూరల్, నవంబరు 27,ప్రభాతవార్త :** సిద్దిపేట రూరల్ మండల రాంపూర్ గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ అభివృద్ధి మిగులు పనులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు రూ.లక్ష విరాళంగా బుధవారం అందించారు. గత ప్రభుత్వ హయాంలో హరీష్‌రావు రూ.10 లక్షలు నూతన ఆలయ నిర్మాణానికి మంజూరు చేయించారని గ్రామస్తులు,నిర్వహకులు తెలిపారు. మిగిలిన పనులకు అదనంగా రూ.లక్ష అవసరం ఉండడంతో హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లగా విరాళలం అందించినట్లు తెలిపారు. రూ.లక్ష విరాళం అందించిన హరీష్‌రావుకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు చందర్‌రావు, ప్రభాకర్‌వర్మ, మోహన్‌రెడ్డి, యాదయ్య, శ్రీకాంత్, బిక్షపతి కృతజ్ఞతలు తెలిపారు.

## పుస్తెలు, మెట్టెల బహూకరణ

**సిద్దిపేట అర్బన్, నవంబరు 27, ప్రభాతవార్త :** అసోషియేషన్ ఆఫ్ అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ సిద్దిపేట జిల్లా శాఖ ద్వారా రేఖసతీష్ దంపతుల సహకారంతో బుధవారం పెస్టెమట్టెలు, పట్టుచీర, చంబు, తాంబూలం, స్టీల్ సామాగ్రిని అందించారు. పుస్తెలు, మెట్టెలతో పాటు ఇతర సామాగ్రి అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## పాదయాత్రకు తరలిన హుస్నాబాద్ ఉద్యమకారులు


పాదయాత్రకు తరలిన హుస్నాబాద్ ఉద్యమకారులు

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 27, ప్రభాతవార్త :** ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చి అమలుచేయడంలో నిర్లక్ష్యవహిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్ర బుదవారం కరీంనగర్‌లోని అమరవీరుల విగ్రహంవద్ద ప్రారంభంకాగా ఈ పాదయాత్రకు హుస్నాబాద్ నుండి ఉద్యమకారులు తరలివెళ్లారు. బుధ, గురువారాలలో జరిగే ఈ పాదయాత్రలో సంఘం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ నాయకత్వంలో అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించి ప్రారంభించారు. పాదయాత్రలో జిల్లా అధ్యక్షులు కుమారస్వామి,నాయకులు మాదాసు శ్రీనివాస్,గడిపె మల్లేష్, సంజీవరెడ్డి, అక్బర్, అంకుశావళి, లక్ష్మీ, స్వాతిరెడ్డి ఉన్నారు.

## పోటు ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటు

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 27, ప్రభాతవార్త :** విద్యార్థి దశ నుండే సిపిఐ పార్టీ నిర్వహించే ప్రజా ఉద్యమాలకు ఆకర్శితుడైన పోటు ప్రసాద్ మరణం సిపిఐ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని అణభేరి సింగిరెడ్డిల అమరుల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోటు ప్రసాద్‌యువజన రంగాలతో పాటు సిపిఐ అనుభంద సంఘాలలో రాష్ట్ర స్థాయిలో వివిధ హోదాల్లో పని చేసిన విషయాన్ని గుర్తు చేశారు.ఆయన జీవితంలో భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి చేసిన సేవలను పార్టీ ఎప్పటికి మరచిపోదన్నారు.ఆయన గుండెపోటుతో చనిపోవడం బాదాకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంజీవరెడ్డి, కొమురయ్య, బాలయ్య, సుదర్శనచారి, పద్మ, జనగాం రాజ్‌కుమార్ ఉన్నారు.

## ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షుడిగా అశోక్

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 27, ప్రభాతవార్త :** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పిఎస్) హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా కొలుగూరి అశోక్‌ను ఎన్నుకున్నట్లు సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ నాయకులు లింగపల్లి శ్రీనివాస్ వివరించారు. బుధవారం పట్టణంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా మండల అధ్యక్షునిగా అశోక్, అధికార ప్రతినిధిగా పొన్నాల వినోద్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా బోయిని రాజశేఖర్, ఎంఎస్‌పి మండల అధ్యక్షుడిగా గడిపె కొమురయ్య, అధికార ప్రతినిధిగా కొమ్ము వెంకటేశ్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సమావేశంలో కౌన్సిలర్ బొజ్జ హరీష్, నాయకులు యాదగిరి, లక్ష్మీనారాయణ, యాదగిరిముక్కర సంపత్, బత్తుల చంద్రమౌళి ఉన్నారు.

## అరుణాచలం ప్రత్యేక ఆర్టీసి బస్సు

**కోహెడ, నవంబరు 27, ప్రభాతవార్త :** అరుణాచలం గిరి ప్రదక్షణకు హుస్నాబాద్ డిపో నుంచి ఆలయానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు కోహెడ రూట్ విలేజ్ ఆఫీసర్ ఉల్లి చంద్రమౌళి బుధవారం తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రలకు హుస్నాబాద్ డిపో నుంచి బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అరుణాచలం వెళ్లేవారు ఒకరికి రూ.4500 చెల్లించి నాలుగు పుణ్యక్షేత్రాలు దర్శించుకునే వీలుంటుందన్నారు. పూర్తి వివరాలకు డిపో మేనేజర్ 9959225930,7382848449 నంబర్లను సంప్రదించాలన్నారు.

## వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలను సాధించాలి : డిఐఈవో రవీందర్‌రెడ్డి


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనా విద్యార్థిని అభినందిస్తున్న డిఐఈవో

**చిన్నకోడూరు, నవంబరు 27, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ రెడ్డి బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోవు మార్చి వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఇటీవల పుట్‌బాల్ క్రీడలలో జాతీయస్థాయికి ఎంపికైనా ఇంటర్మీడియట్ ఎంపిసి మొదటి సంవత్సరం విద్యార్థి కుమారిచైతన్యశ్రీని అభినందించారు. జాతీయ స్థాయిలో గెలుపొంది పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆయన అకాంక్షించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్, ఆధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ సాగుతో పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది

### -ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్

**గజ్వేల్, నవంబరు 27 (ప్రభాతవార్త):** ఆయిల్‌ఫామ్ సాగు చేయడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందని ఆయిల్ ఫెడ్ జిల్లా ఇంచార్జ్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ మండలం బెజుగామ గ్రామంలో ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌ఫామ్ పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ పంట రైతులకు అనేక ప్రయోజనాలను చేకూర్చుతుందని అన్నారు. ఆయిల్‌ఫామ్ పంటపై ఆసక్తి ఉన్న రైతులు తమకు దగ్గరలో ఉన్న వ్యవసాయ విస్తరణాధికారులను లేదా మండల వ్యవసాయాధికారిని లేదా ఆయిల్ ఫెడ్ కంపెనీ ప్రతినిధులకు గానీ ఉద్యాన శాఖ అధికారులకు గానీ దరఖాస్తులను అందించవలసిందిగా కోరారు. జిల్లాలో పెరిగిన భూగర్భ జలాలకు అనుగుణంగా రైతులు ఆయిల్ ఫామ్ పంటలు సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగు తుందన్నారు. దేశ అవసరాలకు సరిపడే పామాయిల్ నూనెను తెలంగాణ రాష్ట్ర సరఫరా చేసేవిధంగా ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగరాజు, ఉద్యాన శాఖ అధికారి సౌమ్య, స్థానిక క్లస్టర్ల మాధవి, ఆయిల్ కంపెనీ ప్రతినిధులు శివారెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, నాంపల్లి బాబు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు ముస్తాబైన పంచలింగేశ్వర ఆలయం



ఉత్సవాలకు ముస్తాబైన పంచలింగేశ్వర ఆలయం

**మనూర్, నవంబరు 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బాలగౌవ్ గ్రామంలోని పంచలింగేశ్వర స్వామి ఆలయలో ఈ నెల 29న నిర్వహించే కార్తీక మాస ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయంలో మాస శివరాత్రి, కార్తీక మాస ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటి బాధ్యులు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు వినతి చేశారు.

## బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన



విద్యార్థులకు బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన కల్పిస్తున్న సంక్షేమాధికారి లలితకుమారి

**ఝరాసంగం, నవంబరు 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలోని మహాత్మ జ్యోతి బాపులే గురుకుల పాఠశాల. కళాశాలలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి లలితా కుమారి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాల నిర్మూలన, బాలల అక్రమ రవాణా నివారణ, హెల్ప్ లైన్ నెంబర్లు 181, 1098ల టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై, భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మెరుగైన విద్యను బోధించాలని పాఠశాల ప్రిన్సిపల్ ప్రేసిల్లకు సూచించారు.

## జడ్పిహెచ్ఎస్‌ను పరిశీలించిన ఆర్‌డిఓ



కంది జడ్పిహెచ్ఎస్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఓ

**కంది, నవంబరు 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కందిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆర్‌డిఓ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాల పరిసరాలను, రికార్డులను ఆర్‌డిఓ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం విషయంలో విద్యార్థులకు పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న కుల గణన ఎంట్రీని పరిశీలించారు. డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని ఆపరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపిఓ మహేందర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు విజయోత్సవ సభ



రైతు విజయోత్సవ సంబరాలపై చర్చిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పాపన్నపేట, నవంబరు 27, ప్రభాతవార్త:** ఈ నెల 29వ తారీఖున మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు విజయోత్సవ సంబరాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మెదక్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధి లోని కొత్తపల్లి సొసైటీ కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చేసిన హామీలను నెరవేరుస్తూ రైతులకు పెద్దపీట వేస్తూ ప్రజలకు బాసటగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని గుర్తు చేశారు. రైతు విజయోత్సవ సంబరాల్లో రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోవింద్ నాయక్, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్ గుప్తా, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మైనార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆఫీస్‌మొల్‌సాబ్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సందీప్, రమేష్‌గౌడ్, ముజీబ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామాయంపేట ఏఈ తిరుపతిరెడ్డి

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబరు 27, ప్రభాతవార్త:** నేడు గురువారం రామాయంపేట 132 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు రామాయంపేట ఏఈ తిరుపతిరెడ్డి తెలిపారు. రామాయంపేట మండల కేంద్రంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# డేటా ఎంట్రీ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

### 55వేల కుటుంబాల సమగ్ర సర్వే డేటా ఎంట్రీ పూర్తి

### జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



అక్కన్నపేటలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబరు 27, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. బుధవారం రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక తహశీల్దార్ రజిని కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన 1,73,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీస్, ట్రక్ షీట్ జనరేట్, మిల్లర్స్ రసీదు పూర్తి చేసుకోవాలన్నారు. ట్యాబ్ ఎంట్రీలో అలసత్వం పనికిరాదని తెలిపారు. ఇవన్నీ పూర్తి చేసిన పక్షంలో మాత్రమే కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం ద్వారా త్వరితగతిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవ్వటం జరుగుతుందన్నారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చిత్తశుద్ధితో వ్యవహరించి రైతులకు న్యాయం జరిగే విధంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా లారీలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదేరోజు రవాణా చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ రజిని, ఐకెపి ఎపిఎం రాములు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

### డేటా ఎంట్రీ ప్రక్రియ...

**రామాయంపేట మున్సిపాలిటీ, నవంబరు 27, ప్రభాతవార్త:** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తిచేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం రామాయంపేట ఎంపిడివో కార్యాలయంలో ఇంటింటి సర్వే డేటా ఆన్‌లైన్ కంప్యూటరీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. సర్వర్ పనితీరు గురించి సంబంధిత అధికారులని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సిఎం ఆదేశాలను పాటిస్తూ తొందర కంటే పారదర్శక డేటా ఎంట్రీ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో సర్వే ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్నామని, జిల్లాలో డేటా ఎంట్రీ 55వేల కుటుంబాలకు పూర్తయిందని తెలిపారు. ప్రజలు సమగ్ర కుటుంబ సర్వేలో అందించిన సమగ్ర సమాచారాన్ని గోప్యతతో ట్రంకు బాక్సులో భద్రపరిచి ఎంపిడివో ఆధ్వర్యంలో, మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఉన్నట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సమన్వయంతో డేటా ఎంట్రీ రాబోవు వారంరోజుల్లో తుది దశకు చేరుకుంటుందన్నారు. డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు చేయరాదన్నారు. ప్రతి కుటుంబం సమగ్ర వివరాలను క్షుణ్ణంగా, సజావుగా నమోదు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట స్థానిక తహశీల్దార్ రజిని, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహర్షి భగీరథుడి విగ్రహం ఏర్పాటు



మహర్షి భగీరథుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, నవంబరు 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని దోమడుగు గ్రామంలో 3 లక్షల 50 వేల రూపాయల సొంత నిధులతో ఏర్పాటు చేసిన మహర్షి భగీరథుడి విగ్రహాన్ని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మండల మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ దివి నుండి భువికి ఆకాశ గంగను తీసుకువచ్చిన భగీరథ మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో గర్వించదగిన విషయమన్నారు. విగ్రహదాత ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్, నారాయణ, ఎండి హుస్సేన్, శేఖర్ సాగర్, మురళీకృష్ణ సాగర్, పెద్ద ఆంజనేయులు సాగర్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కస్తూర్బాగాంధీ విద్యాలయంలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**పెద్ద శంకరంపేట, నవంబరు 27, ప్రభాతవార్త:** సంక్షేమ వసతి గృహాలలో, అంగన్వాడీ కేంద్రాలలో, కస్తూర్బా విద్యాలయాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అధికారి సర్దార్ సింగ్, పెద్ద శంకరంపేట ఎంపిడివో రఫిక్ ఉన్నిసాలు పేర్కొన్నారు. బుధవారం పెద్ద శంకరంపేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, బిసి బాలుర సంక్షేమ వసతిగృహం, పలు అంగన్వాడీ కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మధ్యాహ్న భోజనాన్ని అధికారులు పరిశీలించారు. వంట ప్రదేశాలలో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని. తాజా కూరగాయలను భోజనంలో విద్యార్థులకు అందించాలని సంబంధిత ప్రిన్సిపల్‌ను అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశం, కెజిబివి ప్రిన్సిపల్ విజయ తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరిలో పనుల జాతర

**మునిపల్లి, నవంబరు 27, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన వార్షిక విజయోత్సవాల్లో భాగంగా మన ఊరిలో పనుల జాతర కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు పాండు ఎఎంసి డైరెక్టర్ అమరేశ్వర్, ఉపాధి అధికారులు తమైబు, ప్రవీణ్, ఐకెపి సిసి శివయ్య, గ్రామస్థులు దుర్గాప్రసాద్, అంజయ్య, నారాయణ మాణయ్య, పార్వతమ్మ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకారం

**మనూర్, నవంబరు 27, ప్రభాతవార్త:** మన ఊరిలో పనుల జాతర కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన మనూర్‌లో 10 లక్షల ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో నిర్మించే రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని, అందుకే ప్రజలు ప్రభుత్వానికి సెలవు ప్రకటిం చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను అందుకుంటున్నారని, మహిళలకు ఉచత బస్సు సౌకర్యం, 500లకే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, పేదల ఉన్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. పేదలు ఉన్నత చదువులు అందుకునేందుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లను ప్రారంభించనున్నదని గుర్తుచేశారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్‌కుమార్ శెట్కార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు వినోద్ పాటిల్, రమేష్ చౌహాన్, పంపరిరెడ్డి, రాజు, సంజీవులు, సిద్ధారెడ్డి, పోచయ్య, తాహిర్ అలీ, ఆకాశ్‌రావు పాటిల్, అహూక్‌రెడ్డి, శివకాంత్ పాటిల్, రాజు కుర్మా, జగదీశ్‌రెడ్డి, సాయిలు, సంజీవులు, ధనరాజ్, ఆయాశాఖల అధికారులు అలివేలు మంగ, మహేష్ కుల్‌కర్ణి, మొగినీ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి మాకొద్దు



ఎంపిడిఓకు వినతిపత్రం అందచేస్తున్న తుమ్మన్‌పల్లి పంచాయితీ వాసులు

**ఝరాసంగం, నవంబరు 27, ప్రభాతవార్త:** తుమ్మన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి తమకొద్దంటూ తుమ్మన్‌పల్లి, పంచాయతీ ఆమ్లెట్ గ్రామం సంఘం (కే) గ్రామస్థులు బుధవారం మండల అభివృద్ధి అధికారి సుధాకర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రజలకు కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి నిత్యం విధులకు హాజరు కాలేకపోతుండటంతో తాము అనేక ఇబ్బందులకు గురవుతున్నామని విచారం వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీటి సమస్యలు ఉన్నా, పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీకి మరో కొత్త పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఆయా గ్రామస్థులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి. సుధాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సంగయ్య, వెంకట్‌రెడ్డి, ఎంపినవాజ్, భాస్కర్‌రెడ్డి, కృష్ణరెడ్డి, పాషా, మతిన్, ముస్తాఫా పాల్గొన్నారు.

## వసతిగృహాల తనిఖీ

**అల్లాదుర్గం, నవంబరు 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని వసతి గృహాలను మండల ప్రత్యేక అధికారి ఎ.కరుణాకర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, బిసి బాలికల వసతి గృహం, ఎస్సి బాలుర వసతి గృహాలను కరుణాకర్ సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై, భోజనం విషయంపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని బాద్యులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా వార్డెన్, మెట్రిన్‌లు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్ చంద్రశేఖర్, సూపరిండెంట్ క శంకర్, ఏపిఓ లింగప్ప, పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు కనీస వేతనాలు ఇవ్వాలి

### టిఎస్‌యుటిఎఫ్ డిమాండ్



కెజిబివి పాఠశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న టిఎస్‌యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

**నర్సాపూర్ నవంబరు 27, ప్రభాతవార్త:** కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు(రేబితీజు), అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నర్సాపూర్ మండలాధ్యక్షులు రవి, కార్యదర్సులు గంగాధర్, వసురాంలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నభోజన విరామసమయంలో కెజిబివి చిప్పల్‌తుర్తి పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నర్సాపూర్ మండలాధ్యక్షులు రవి మాట్లాడుతూ రేబితీజు ఉద్యోగులు చాలీచాలని జీతాలతో భారంగా జీవితాలు గడుపుతున్నారని, ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అందుకుంటున్న నేపథ్యంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా జీతాలు తక్కువేనన్నారు. కాగా వారికి రెగ్యులర్ వారితో సమానంగా జీతాలు పెరగటం లేదని వాపోయారు. టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త దశలవారీ పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఏళ్ల తరబడి తక్కువ వేతనంతో ప్రభుత్వం వారితో వెట్టి చాకిరీ చేయిస్తుందని, ఉపాధ్యాయులు శ్రమదోపిడీకి గురవుతున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి కనీసవేతన ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధర్, వసురామ్, టిఎస్‌యుటిఎఫ్ కెజిబివి రాష్ట్ర కమిటీసభ్యులు సుహాసిని, పాఠశాల ప్రత్యేక అధికారి శ్వేత, ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ మండలానికి గెజిట్ జారీ



ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్న మండల కాంగ్రెస్ నాయకులు

**నిజాంపేట్, నవంబరు 27, ప్రభాతవార్త:** నిజాంపేట్ మండలాన్ని గెజిట్ ఇచ్చినందుకు మండల కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతుల తెలిపారు. బుధవారం నిజాంపేట్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రజల సంక్షేమానికి కృషిచేస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ మాజీ ఎంపిటిసి సభ్యులు రాములు సేట్, మాజీ సర్పంచ్ రఘుపతిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు షేక్ నబీర్, నాయకులు కిష్టయ్య, శంకర్, విస్కీ పటేల్, శ్రీకాంత్‌లు రాష్ట్ర ముఖ్యమంత్రికి, నారాయణఖేడ్ శాసన సభ్యులకు తదితరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ధార్మికవేదిక షెడ్ నిర్మాణానికి భూమిపూజ



శివాలయంలో ధార్మిక వేదిక షెడ్ నిర్మానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

**కొల్చారం, నవంబరు 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని శివాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి భక్తుల సౌకర్యార్థం కొల్చారం గ్రామ పురోహితులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ధార్మిక వేదిక షెడ్ నిర్మాణం కోసం గ్రామస్థులతో కలిసి బుధవారం భూమి పూజ కార్యక్రమాన్ని శివాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ శర్మ, తిమ్మన్నగారి ఆంజనేయులు, జూలకంటి సంగమేశ్వర్, ఆలయ అర్చకులు ప్రభాకర్ శర్మ, గంగసాని రాజిరెడ్డి, చౌరిగారి చిన్న రాములు, బొజ్జా వీరేశం, నింగోల్ల చెన్నయ్య, బొజ్జ వెంకటరమణ, పెద్దపురం అశోక్, ముత్యం రఘు, ఆకుల సిద్ధిరాములు, చింతల రామానుజన్, భక్తులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ ఏర్పాటు పట్ల హర్షం



మండల పరిషత్ ఏర్పాటు పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నకాంగ్రెస్ నాయకులు, యువకులు

**వెల్దుర్తి, నవంబరు 27, ప్రభాతవార్త:** నూతనంగా ఏర్పాటైన మాసాయిపేట మండలంలో మండల పరిషత్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంతో మాసాయిపేట చెందిన కాంగ్రెస్ నాయకులు, హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద టపాసులు కాలుస్తూ, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయితీ రాజ్ మంత్రి సీతక్క, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహలతో పాటు పిసిసి ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ నర్సింలు, సిద్ధిరాములు గౌడ్, శ్రీకాంత్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## అష్టాంగ యోగాతో ఆరోగ్యం



యోగాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, నవంబరు 27 ప్రభాతవార్త:** అష్టాంగ యోగాతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని యోగా గురువు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో యోగా సభ్యులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు.

## పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్డీవో



సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల వంటశాలను పరిశీలిస్తున్న ఆర్డీవో మహిపాల్

**కొల్చారం, నవంబరు 27 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొల్చారంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను బుధవారం నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ పాఠశాలలో వండిన ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శౌచాలయాల తలుపులు చెడిపోయినందున బాగు చేయించాలని ప్రిన్సిపల్ సత్యవతికి సూచించారు. పాఠశాల ఆవరణలోకి కుక్కలు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహిపాల్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంక్షేమ వసతి గృహాల్లో వసతులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలలో కొన్ని మైనర్ రిపేర్‌లు తప్ప అన్నీ బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ మహమ్మద్ గఫర్ మియా, ఎంపిడివో కృష్ణవేణి, పంచాయితీ కార్యదర్శి అంజయ్య, రెసిడెన్షియల్ పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.